కథ

# ఒబేసిటీ డాట్ కామ్

వేముల రామమోహనరావు



"తిండానికేమైనా ఉంటే ఇలా పట్రావే, నూకాలూ!" టి.వి. చూస్తూ, ఏనుగులా ఘీంకరిస్తూ ఆర్డర్ వేశాడు సుబ్బారావు. ఆ పక్కనే కూర్చున్న 'దిబ్బరొట్టె'లా ఒళ్ళంతా ఒకే సైజులో పెంచిన సుబ్బారావు పెళ్ళాం శ్రీలత కూడా "నూకాలూ - నాక్కూడా గుప్పెడు హార్లిక్స్ కలిపి పాలు తీసుకురా" అంది దర్జాగా. "నాకూ జామూ బన్నూ - నూకాలూ" బుల్లి ఏనుగులాంటి పుత్రుడు సునీల్ కూడా అరిచి చెప్పాడు.

"'ఆఁ ఇదిగో ... సిటికలో పట్టుకొత్తాను" అని చెప్పింది పనిమనిషి నూకాలు.

'ఈ గున్నేనుగులకి సాకిరి సేయనేక సత్తున్నాను - దున్నపోతుల్లా తిండవే తప్ప - పిసరంత పనీ సెయ్యరుగదా! సూడు ఆల ముగాలు' అని మనసులో తిట్టుకుని, వాళ్ళార్డరేసిన అయిటమ్స్ అన్నీ చకచకా ఒక ట్రేలో సర్ది, తెచ్చి, టీపాయ్ మీద పెట్టింది నూకాలు.

సుబ్బారావ్, శ్రీలత, సునీల్ వాటిని తెలీయకుండానే లాగించేస్తున్నారు. వాళ్ళ నోళ్ళ వైపు నూకాలు నోరెళ్ళబెట్టి చూసి 'ఈల తిండి పాడుగానూ! అవి నోళ్ళా లేక మిసన్లా?!' అని మూతి తిప్పింది.

ఎదురుగా టీవీలో మంచి ప్రోగ్రామ్ వస్తుంటే కన్నార్పకుండా చూస్తున్నారు వారు. అంతవరకూ టీవీలో వస్తున్న ప్రోగ్రామ్‌కి కమ

ర్షియల్ బ్రేక్ పడింది. ఒక్కసారిగా ఎడ్వర్టయిజ్మెంట్స్ మొదలయ్యాయి. వాటిని చూసి సుబ్బారావుకి చిరాకేసింది. ఇంతలో టివిలో ఒక అందమైన అమ్మాయి కనిపించగానే, ఆ సన్నని నడుము చూస్తూ తేపకార్చాడు. ఆమె పళ్ళు ఇకిలించి నవ్వి "మీకు చిరాకెత్తింది కదూ?! అయినా సరే, ఛానల్ మార్చకండి – సన్నబడే ఛాన్స్ మిస్సవకండి! మీరు కూడా నాలా నాజూగ్గా తయారవాలనుందా? అయితే మా 'ఒబేసిటీ డాట్ కామ్ క్లినిక్'కి రండి. ఒబేసిటీని దూరం చేసుకోండి" అని ఫోను నంబరు చెప్పి, మరోసారి తన కొలతలని వయ్యారంగా చూపి, నవ్వి, మాయమయ్యింది.

ఆ అడ్వర్టయిజ్మెంట్ను చూసి సుబ్బారావు, శ్రీలతలు పొంగిపోయి 'హుర్రే!' అని అరిచారు. 'భల్లే భల్లే' అని డాన్స్ చేశారు. వారిమధ్య కొడుకు సునీల్ కూడా నడుం ఊపాడు. ఇదంతా చూస్తున్న నూకాలు 'ఈల సంబడం .సంతకెళ్ళ! – ఏంటయిందీలకి? ఉండుండి ఒక్కపాలే గెంతుతున్నారేటి?' అని వింతగా చూసింది, వాళ్ళ వింతచేష్టల్ని.

"ఏయ్ నూకాలూ – మేమూ నీలాగే సన్నగా తయారవుతాం. 'టింగూ–టింగూ' అంటూ నడుము ఊపుకుంటూ నడుస్తాం – చూస్తూ ఉండు. వ్వె.. వ్వె... వ్వె..." అని నాలుక బయటపెట్టి చెవులపై చేతులు పెట్టి వెక్కిరించాడు సుబ్బారావు. బదులుగా 'వ్వె...వ్వె... వ్వె" అని సరదాగా వెక్కిరించి 'పందులెక్కడైనా పలసబడతాయా?' అనుకుంటూ నడుం తిప్పుకుంటూ వెళ్ళిపోయింది నూకాలు.

హుషారుగా సుబ్బారావు ఆ 'ఒబేసిటీ డాట్ కామ్' క్లినిక్కి ఫోన్ చేసి ఎప్పుడు రావాలో అడిగాడు. రేపుదయం ఆరు గంటలకు రమ్మని అపాయింట్మెంట్ ఇచ్చారు వారు.

పెళ్ళయినప్పటికి – సుబ్బారావు, శ్రీలతలు 'కటిక పుల్ల'ల్లా సన్నగా, రివటల్లా ఉండేవారు. కానీ సుపుత్రుడు సునీల్ ఉద్భవించాక అడ్డు అదుపూ లేకుండా అడ్డంగా వూరుతూ లావెక్కారు. దానిక్కారణం ఉంది. ఇంట్లో పని అస్సలు ముట్టుకోరు. ఇటు పుల్ల తీసి అటు వేయరు సరికదా, పొద్దస్తమానం తినడం, పందుల్లా పడుకోవడం – పైగా నేతి వేపుడు కూరలు, ఐస్క్రీమ్లూ, స్వీట్లూ, హాట్లూ, బర్గర్లు, పిజ్జాలు, నూడిల్స్, చిప్సూ... ఒకటేమిటి నానా'గడ్డీ' పీకల నిండా మెక్కుతారు. అలా తినడానికీ కారణం ఉంది. ఊరికే కాలు మీద కాలేసుకుని, పనోళ్ళను పంపి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు సుబ్బారావు. మూడు ప్లాట్లు, ఆరు కట్టలూ అన్నట్లు తెగ రాలుతున్నాయి నోట్ల కట్టలు. ఎంత తిన్నా తరగని సొమ్ము. తిని కూర్చోవడమే పనయింది వారికి. అందుకే వారందరి పొట్టలు అరకిలోమీటరు ముందుకు – సీట్లు అరకిలోమీటర వెనక్కి పొడుచుకొచ్చాయి.

ఎంతమంది ఎక్సర్సైజులు చేయమన్నా తమ వల్లగాక ఏనుగుల్లా తయారయ్యారు. ఇంటిని ఏనుగుల పార్కులా తయారుచేశారు. 'దగ్గర్లోకి సుఖంగా ఒళ్ళు తగ్గించే క్లినిక్లు ఎప్పుడొస్తాయా' అని ఎదురు చూస్తుండగా, ఈరోజు టీవీలో వచ్చిన ఒబేసిటీ డాట్ కామ్ ఎడ్వర్టయిజ్మెంట్ చూసి ఆనందంతో గంతులేశారు.

మళ్ళా ఆ రాత్రికి పొట్టనిండా 'ఆంపట్టు' పట్టి, మంచాలెక్కారు. తెల్లారితే ఒబేసిటీ క్లినిక్కి వెళ్తున్నానని మనస్సు ఆనంద డోలికల్లో తేలియాడుతుంది సుబ్బారావుకి. 'తెల్లవారితే భాగ్యలక్ష్మి బంపర్ డ్రా' అన్నంత సంతోషపడిపోతున్నాడు. 'ఎంతవేగం తెల్లారుతుందా' అని ఎదురుచూస్తూ – నిద్రపట్టక దొర్లితే ఆఖరికి అర్ధరాత్రి దాటాక నిద్రపట్టింది – గాఢంగా.

మర్నాడుదయం ఊక బస్తాల్లాంటి ఆ ముగ్గురి ఊబకాయాల్ని మోసుకుంటూ మూడు ఆటోలు బయలుదేరి, ద్వారకానగర్, ఆరోవీధిలో వున్న 'ఒబేసిటీ డాట్ కామ్ క్లినిక్' వద్ద ఆగాయి. ఆటోల్లోంచి ముగ్గురూ దిగి 'దిగ్గజాల్లా' క్లినిక్లోనికి వెళ్ళారు. అక్కడ అతిసన్నని నడుములతో, గాలిలో తేలిపోయేటట్టు, చలాకీగా కదిలే అమ్మాయిలు వీరిని పలకరించి, ఆ తర్వాత 'డైరెక్టర్' గదికి తీసుకువెళ్ళారు.

కొన్ని సి.డిలు చూపించి "ఇలా మీరూ తయారవ్వాలంటే ఈ బాండ్ పేపర్పై సంతకం చేయాలి. ఇంటి డాక్యుమెంట్స్ని ష్యూరిటీగా ఇవ్వాలి. ముగ్గురికి అరవైవేలు ఫీజు. కోర్సు ఐదు వారాలు. ఐదు వారాలు దాటాక మీరు స్లిమ్ కాకుంటే ఫీజు వాపస్..." టకాటకా వివరించింది డైరెక్టర్ వినీల.

"ఇంత తతంగం ఉందా? మరీ మీ చాదస్తం కాకపోతేనూ?!" అన్నాడు సుబ్బారావు.

"మా రూల్స్ మావి. ఇలాంటి రూల్స్ పెట్టకపోతే మధ్యలో మానేస్తున్నారు" అందామె.

"మాకు గ్యారంటీగా తగ్గుతుంది కదూ?!" అడిగాడు సుబ్బారావ్.

"అందుకే మేం 'కంపల్సరీ ట్రీట్మెంట్ సిట్యుయేషన్' కల్పిస్తాం" అందామె.

"ఏంటదీ!"

"ఫరెగ్జాంపుల్ – మీరు ఇంగ్లీషు నేర్చుకోవాలనుకోండి – చుట్టూ తెలుగువారుంటే వేగం నేర్చుకోలేరు. అదే వేరే కంట్రీలో చుట్టూ ఇంగ్లీషు వారుంటే 'కంపల్సరీ'గా నేర్చుకుంటారు. అలాగే ఇదీనూ – అలా సిట్యుయేషన్స్ క్రియేట్ చేస్తాం" అంది.

"సర్లెండి. రేపొచ్చి తప్పక జాయిన్ అవుతాం" అని చెప్పి ఇంటికొచ్చేశారు. మర్నాడు ఆ ఆఫీసులో ఇంటి డాక్యుమెంట్స్ ష్యూరిటీగా ఇచ్చి, అరవై వేల ఫీజు కట్టి జాయిన్ అయ్యారు ముగ్గురూ.

కొద్దిసేపట్లో ఒక మినీబస్ వచ్చి ఆగింది. అందులోనుంచి ఒక డ్రైవర్ దిగి ముగ్గుర్నీ సాదరంగా బస్సెక్కించాడు. చాలా దూరం తీసుకెళ్ళి ఒకచోట దించాడు.

తాము ఎక్కడున్నామో తెలియలేదు సుబ్బారావుకి. అదే అడిగాడు డ్రైవర్ని. "మీరు క్షేమంగా ఉన్నారు. మా క్లినిక్లో ట్రీట్మెంట్ ఫీల్డ్ ఇది. ఒబేసిటీ డాట్ కామ్లో 'సిటీ' ఇది" అన్నాడు.

అక్కడ ఓ వంద కుటుంబాలున్నాయి. ఆశ్చర్యంతో అంతా చూస్తున్నాడు సుబ్బారావు. ఇంతలో ఒక అందమైన అప్సరసలాంటి అమ్మాయి వచ్చి, ముగ్గురికీ డ్రస్లు ఇచ్చి యూనిఫామ్ తొడుక్కోండి అంది. అవి ఉతికిన కాటన్ బట్టలు. అవి వేసుకున్నాక "మీకు ట్రీట్మెంట్ ఐదు వారాలపాటు ఉంటుంది. వారానికో కోర్సు మారుతుంది. మీరు మాకు సహకరించాలి" అందామ్మాయి. 'సరే' అన్నట్టు తలూపారు సుబ్బారావు, శ్రీలత, సునీల్.

"మొదటివారం పొలంలో టమాటా పండించాలి" చెప్పిందామె. సుబ్బారావు బిత్తరపోయాడు. "ఇదేమి ట్రీట్మెంట్? మాతో పనిచేయిస్తారా?" అని అడిగాడు.

"ఆ౦ మీకు తెలియదా. ఒబేసిటీ డాట్ కామ్లో 'కామ్' అంటే హిందీలో 'పని' అని అర్థం. తెలిసింది కదా! మొదట కష్టం అనిపించినా ఆ తర్వాత అలవాటవుతుంది" అందామె.

"ఊహు! మేం చెయ్యం" అన్నాడు తల పంకించి సుబ్బారావు. శ్రీలత, సునీల్ కూడా చేయమని మొండిపట్టు పట్టారు. ఇంతలో ఒకడు కొన్ని డాబర్మేన్ కుక్కల్ని తెచ్చి 'ఉస్కో' అని వదిలిపెట్టాడు. అవి ముగ్గుర్నీ వెంట తరిమాయి. భయంతో పరుగుదీసి అలసిపోయి, రొప్పుతూ ఒక దగ్గర ఆగారు. అక్కడికి ఆ అమ్మాయి వచ్చి "నేను చెప్పింది చేయకపోతే


ఒక్కసారి కాకతీయను సంప్రదించండి.
ఇక వెళ్ళి పెళ్ళి ఏర్పాట్లు చేయండి.

కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్

103, 109 & 203, విజయశ్రీ అపార్ట్మెంట్స్, చర్మాస్ వెనుక, అమీర్పేట్, హైదరాబాద్ - 500 073.

ఫోన్ : 040-2374 7777, 09396 999 999



www.kaakateeya.com


శ్రీమతి & శ్రీ చిరంజీవి యలమంచి

FREE online registration & Free search

AN ISO 9001:2000 ORGANISATION

www.kaakateeya.com www.telugumarriages.com www.kannadamarriages.com www.tamilmarriages.com

| | | | |
|---|---|---|---|
| అమీర్పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్పల్లి | 093913 11444 | (చెన్నై) టి. నగర్ | 093400 99993 |
| ఆర్టీసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | (చెన్నై) పోరూర్ | 093855 99077 |
| దిల్సుఖ్నగర్ | 098485 66733 | (చెన్నై) తాంబరం | 093400 99993 |
| విజయవాడ | 093922 92939 | బెంగుళూరు | 093429 39345 |
| గుంటూరు | 098485 35375 | జయానగర్ | 093429 39343 |
| తెనాలి | 098480 31931 | మైసూరు | 093429 39342 |
| విశాఖపట్నం | 098481 63833 | కోయంబత్తూరు | 093457 94668 |
| రాజమండ్రి | 098485 35377 | సేలం | 093855 99066 |
| కాకినాడ | 098483 37378 | మధురై | 093603 35233 |
| ఖమ్మం | 093470 59988 | వెల్లూర్ | 093449 94400 |
| ఒంగోలు | 098487 11223 | తిరుచి | 098428 01111 |
| నెల్లూరు | 098481 97222 | పాండిచ్చేరి | 098421 27777 |
| తిరుపతి | 098485 35378 | ఈరోడ్ | 093855 99011 |
| కర్నూల్ | 093900 33815 | అనంతపూర్ | 093460 09348 |




కుక్కలు తాట తీస్తాయి'' అంది కటువుగా.

''తాట తీస్తాయా - వామ్మో!'' అన్నారు- ఎదురుగా ఆగి ఉన్న కుక్కల్ని చూసి జడుసుకున్నారు.

ఇక కుక్కల దెబ్బతో కిక్కురుమనకుండా మొదటి వారం రోజులూ పొలంలో పనిచేసి టమాటా పంట పండించారు. ఇక తిండి విషయానికొస్తే... నకనకలాడేదాకా భోజనాలకి పిలవరు. తీరా పిలిచాక ఓ పిడికెడు అన్నం, గరిటెడు ఉడికీ ఉడకని కూర పెట్టి, రాత్రికి రెండు పుల్కాలతో సరిపెడుతుంటే 'ఇంత శరీరానికి ఇంత ఆహారమా?' అని మూలుగుతూ నిట్టూర్చాడు సుబ్బారావు.

రెండోవారం వచ్చింది. ఆ అమ్మాయీ వచ్చింది. ట్రీమ్‌మెంట్‌లో రెండోవారం 'బావి తవ్వాలి' అంది.

''బాబోయ్ బావా?'' అన్నాడు నోరెళ్ళబెట్టి సుబ్బారావు.

''బావా? తవ్వాలా? మేం తవ్వం'' అన్నారు శ్రీలత, సునీల్ కూడా.

''తవ్వకపోతే కుక్కలు పీక్కుతింటాయి - మీ యిష్టం'' అంది ఆమె, అటువైపు చిటికె వేస్తూ.

ఆ కుక్కలు పళ్లు ఇకిలించి గుర్రుగా మొరిగాయి. అంతే! గునపం, పార, తట్ట పట్టుకుని బెదురుబెదురుగా ''ఎక్కడ తవ్వాలి? గొయ్యి!'' అన్నాడు సుబ్బారావు.

''గొయ్యి కాదు - నుయ్యి'' అందామె పొలంపక్క చూపుతూ.

ఉస్సూరుమంటూ పని మొదలుపెట్టారు. సుబ్బారావు గునపంతో తవ్వుతుంటే, సునీల్ మట్టి తట్టలోకి ఎత్తుతుంటే, శ్రీలత మోస్తోంది. అలా వారం రోజుల్లో నుయ్యి తవ్వేశారు వారు.

ఇక మూడోవారం రానే వచ్చింది. ఆ అమ్మాయి ముగ్గురినీ వెంటబెట్టుకొని గేదెల షెడ్‌లోకి తీసుకెళ్ళింది. ''ఈవారం వీటికి గడ్డి, తెచ్చి, మేపి, పాలు తీసి ఇవ్వాలి'' అని చెప్పింది. ''లేకుంటే...?'' అని కుక్కలవైపు చూసింది.

''ఆc ఆc... వాటితో ఇప్పుడేం పనమ్మా! నువు వెళ్లు - మేం గేదెల్ని చూసుకుంటాం. వెళ్ళు... వెళ్ళూ... వెళ్లూ...'' అని తమ ప్రారబ్ధాన్ని తిట్టుకుంటూ సినిమా డైలాగ్‌లా చెప్పాడు సుబ్బారావు.

ఆ వారం అంతా 'గొడ్డు చాకిరి' చేశారు. ఆ తర్వాత వారం వచ్చింది.

''ట్రీట్‌మెంట్‌లో నాలుగో వారం ఏంటి చెయ్యాలో సెలవీయండి కానీ 'వాటిని' వదలకండి'' అని ప్రాధేయపడినట్టు అడిగాడు సుబ్బారావు కుక్కలవైపు దీనంగా చూస్తూ.

''షెబాష్! లైన్లో పడ్డారు. ఈవారం అంతా మీకు భోజనాలు 'కట్'! తినాలంటే సంపాదించుకోవాలి'' అందామె దర్జాగా.

''అమ్మో... వామ్మో... ఏంటమ్మో ఈ ఫిటింగూ? భోజనాలుండవా? మరి మా పొట్టల సంగతో'' నాలుక చప్పరిస్తూ అడిగాడు సుబ్బారావు, పొట్టని నిమురుతూ.

''వెరీ సింపుల్! ఇక్కడున్న ప్రతి ఇంటికి వెళ్ళి, పని చేసి సంపాదించుకొని తినాలి'' అని సలహా ఇచ్చిందామె.

''ఇది సింపులా? చేమదుంపలా? మా దుంపదెంచుతున్నారు గదా!'' అని చిర్రున లేచాడు సుబ్బారావు.

''ఇలా అయితే మేం ఇంటికి పోతాం'' అంది శ్రీలత.

''ఆc ఆc అలాంటి పప్పులేం ఉడకవు. మీ ఇంటి డాక్యుమెంట్స్ మా దగ్గరున్నాయి కదా'' అంది కేర్‌లెస్‌గా ఆ అమ్మాయి.

చేసిన వెధవ పనికి చెడామడా చెంపలేసుకుని ''ఇక పదండి'' అన్నాడు సుబ్బారావు. ప్రతి ఇంటికెళ్ళి, ఇల్లు ఊడ్చి, కడిగి, భత్యం సంపాదించి, తెచ్చుకుని పొయ్యిపై వండి తిన్నారు ఆ వారం అంతా!

చివరివారం - ఐదో వారం - 'హమ్మయ్య!' అని అనుకున్నంతలోపే ఆ అమ్మాయి ఖంగుతినేలా ''ఈ వారం అంతా అడుక్కొని తినాలి'' అంది.

''మేం అడుక్కొని తినాలా?'' నోరెళ్ళబెట్టారు ముగ్గురూ.

''ఆc అడుక్కొని తెచ్చుకొని తినండి. అంతే'' అని మూడు చిప్పలు చేతిలోపెట్టి వెళ్ళిపోయింది.

ఇక చేసేదిలేక కేరెక్టర్‌లోకి ప్రవేశించారు ముగ్గురూ.

దేభ్యంగా ముఖాలుపెట్టి ప్రతి ఇంటిముందుకెళ్ళి ''అమ్మా ధర్మం చెయ్యండి తల్లీ! మాదాకబలం తల్లీ'' అని బిక్షం అర్థించారు.

''అడ్డగాడిదల్లా ఉన్నారు. మీకిదేం పోయేకాలం! ఏదేనీ పని చేసుకుని బతకొచ్చుగా!'' అని కసురుకుంటూ ఇంతింత ముద్దలు చిప్పల్లో పడేశారు ఆ ఇళ్ళవాళ్ళు.

''వండినోడికి ఒక కూర, దండినోడికి వంద కూరలు'' అని నాలిక దబ్బల్లించి సుబ్బారావు భిక్షాన్ని తినబోతుంటే ''ఛీ - సిగ్గులేదూ? ఆ తిండి ఏ గజ్జి చేతుల్తో వండారో?'' అని అంది శ్రీలత. తీక్షణంగా ఆ ముద్దకూడును చూసి ముఖం చిట్లించి ఆ అన్నం అంతా అవతల పారేశాడు అసహ్యంతో సుబ్బారావు.

ఆ వారం అంతా మంచినీళ్లు తాగి సరిపెట్టుకున్నారు. ఏనుగుల్లా ఉన్నవారు పీనుగుల్లా తయారయ్యారు. ఇంతలో అక్కడికి డైరెక్టర్ వినీల వచ్చింది. ''అద్భుతం! మీరు చాలా స్లిమ్‌గా తయారయ్యారు. మీ కోర్సు పూర్తయింది. ఇదిగో మీ ఇంటి డాక్యుమెంట్స్. ఇక మీరు వెళ్ళొచ్చు!'' అంది బయటకు ఎలా వెళ్ళాలో దారి చూపుతూ.

పాపం! లేవడానికి శక్తిలేదు సుబ్బారావు వాళ్లకి. నోరెళ్ళబెట్టి రెండు చేతులూ వేలాడదీసి, వంగి నిల్చున్నారు. తోటకూర గాడల్లా వాడి - వణుకుతున్నారు. అతికష్టమ్మీద ముందుకు కదిలారు. ఇక నడిచివెళ్ళడం కుదరదని, పాక్కుంటూ బయలుదేరారు. ముందు సుబ్బారావు, ఆ వెనుక శ్రీలత, సునీల్‌లు ఒకరి వెనుక ఒకరు అలా పాక్కుంటూ వస్తుంటే కుక్కలు తోకాడించాయి. ఎంత పాకుతున్నా ఇల్లు రావడంలేదు. అయినా పాకడం మానలేదు. ఎప్పటికైనా ఇంటికి చేరుతామన్న ఆశతో.

అలా మంచంపై నుంచి పాకి, నేలమీద పడ్డాడు సుబ్బారావు. నేలమీద పాకుతున్నాడు. ఇంతలో పని మనిషి నూకాలు వచ్చింది.

''ఏంటయింది బాబుగారికి? అలా బంగురుతున్నారేటి?'' అని ఆశ్చర్యపడి అమ్మగారిని పిలిచింది.

''అమ్మగారూ! బాబుగారు మంచంకింద ఇందాకటినుంచి బంగురుతున్నారు. నిద్దట్లో అనుకుంటాను. రండి'' అది.

శ్రీలత నీళ్ళు తెచ్చి సుబ్బారావు ముఖంపై చల్లింది. సుబ్బారావు విదిలించుకుంటూ లేచాడు. అయోమయంగా చూశాడు.

''ఇదంతా కలా?!'' అని మనసును తేలికపర్చుకున్నాడు.

ఇంతలో గుర్తొచ్చి ''ఏవండీ! ఒబఏసిటీ డాట్ కామ్‌కి వెళ్దామన్నారు కదా?'' అంది శ్రీలత.

''అక్కడకెందుకులేవే! ఇంటిలో పనిచేసుకుంటే తగ్గిపోయే దానికి అంతవరకూ ఎందుకే. మన పనిమనిషిని మాన్పించి, మన పని మనమే చేసుకుందాం'' అన్నాడు సుబ్బారావు.

''మీ వల్లులు తగ్గాలంటే నేను పని మానితే సరిపోతాదంటే, అలాగే మానేత్తాను బాబుగోరూ'' అంది నూకాలు కళ్లు చెమర్చి.

ఇంతలో టి.వి. ఆన్ చేశాడు సునీల్. టి.విలో న్యూస్ వస్తోంది. ''నగరంలో ఈమధ్య వెలిసిన 'ఒబేసిటీ డాట్ కామ్' క్లినిక్ వేల ఫీజులు వసూలుచేసి బోర్డు తిప్పేశారు'' అని న్యూస్ విని - సుబ్బారావు ''హమ్మయ్య! ఫీజు కట్టివుంటే మన పని గోవిందా అయివుండేది'' అని ఊపిరి పీల్చుకున్నాడు.

★